నల్ల పోచమ్మ ఆలయ అధ్యక్షుడిగా మహేశ్



మాట్లాడుతున్న ఆదర్ల మహేశ్

గౌలిపురా: గౌలిపురాలోని నల్ల పోచమ్మ ఆలయ సర్వసభ్య సమావేశాన్ని ఆదర్ల మహేశ్ అధ్యక్షతన నిర్వహించారు. రాబోయే ఆషాఢ మాసం బోనాలను అత్యంత వైభవంగా నిర్వహించాలని తీర్మానం చేశారు. బోనాల ఉత్సవాలకు ప్రభుత్వం తరఫున అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదర్ల మహేశ్ అన్నారు. ఉత్సవాలకు ముందే పాతబస్తీలోని ఆలయాల వద్ద చేపట్టాల్సిన అన్ని అభివృద్ధి పనులను జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ వెంటనే చేపట్టాలన్నారు. అనంతరం ఆలయ కమిటీని ఎన్నుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడిగా ఆదర్ల మహేశ్, ఉపాధ్యక్షులుగా డొంకి యాదగిరి, కొడి సురేందర్, పి.రాంమూర్తి, కె.దేవేందర్, పి.ఇమ్మానియేల్, ఎం.కుమార్, జి.ఎం.జ్యోతి కుమార్, కె.ప్రభాకర్, ఎం.చంద్రశేఖర్, జె.చిరంజీవి, పుప్పాల మధుసూదన్ రావు, ప్రధాన కార్యదర్శి జీపీ సురేశ్ కుమార్, సహాయ కార్యదర్శులుగా ఎ.దయానంద్, జి.బాబు రావు, సి.చంద్రమోహన్, ఎ.ప్రభుదాస్, ఎల్.రాజేశ్వర్, కొడి దేవేందర్, ఎం.రామానంద్, ఎ.రాజ్ కుమార్, ఎ.పార్థసారథి, లింగాల రమేశ్, ఎం.శివ కుమార్, కోశాధికారిగా బ్రహ్మానందను ఎన్నుకున్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



చాంద్రాయణగుట్ట: విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని ఛత్రినాక పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కె.ఎన్.ప్రసాద్ వర్మ అన్నారు. శంషీర్‌గంజ్‌లోని శారద విద్యాలయలో ఆదివారం జరిగిన కిడాన్ స్పోర్ట్స్ అకాడమీ ద్వితీయ వార్షికోత్సవం క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్లాడియేటర్ టీం కెప్టెన్ తేజస్, వైస్ కెప్టెన్ వికాస్, రన్నరప్‌గా నిలిచిన సి లయన్స్ జట్టు కెప్టెన్ కాలే వికాస్ వర్ధన్, వైస్ కెప్టెన్ వివేక్ వర్ధన్‌కు ట్రోఫీ, మెడళ్లను అందజేశారు. కిడాన్ స్పోర్ట్స్ అకాడమీ మేనేజింగ్ డైరెక్టర్ ఏబి ప్రకాష్, ఎస్సై త్రిమూర్తులు, క్రికెట్ కోచ్ ఆసిస్ శ్రీవాస్తవ్, దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

తవ్వారు.. వదిలేశారు..

- పాతబస్తీలో తవ్వి వదిలేసిన రోడ్లతో ప్రజల ఇక్కట్లు
- రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు





గౌలిపురాలో కేబుల్ వైర్ల కోసం తవ్వి వదిలేసిన రోడ్డు

గౌలిపురా: పాతబస్తీలోని పలు ప్రాంతాల్లో కేబుల్ వైర్ల కోసం, అభివృద్ధి పనుల పేరిట రోడ్లను అధికారులు తవ్వారు. రోజులు గడుస్తున్నా కొత్త రోడ్లు వేయకపోవడంతో స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా రోడ్లను అందుబాటులోకి తేవాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

గౌలిపురా డివిజన్‌లో..

గౌలిపురా డివిజన్‌లో కేబుల్ వైర్ల కోసం తవ్విన రోడ్డును అధికారులు అలాగే వదిలేయడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గౌలిపురా శిశు మందిర్ పాఠశాల నుంచి గౌలిపురా కల్లు కాంపౌండ్ వరకు ఎలక్ట్రికల్ కేబుల్ వైర్ల కోసం 45 రోజులకు పైగా అవుతున్నా..ఇప్పటి వరకు కేబుల్ వైర్లను వేయకుండా తవ్విన రోడ్డును నిర్లక్ష్యంగా వదిలేయడంతో స్థానిక ప్రజలు, వాహనదారులు పడరాని పాట్లు పడుతున్నారు. కంకర తేలి ప్రమాదకరంగా మారిన రోడ్డుతో వాహనదారులు, స్థానికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. దీనిపై అధికారులు వెంటనే స్పందించి కేబుల్ వైర్ల పనులను వెంటనే పూర్తి చేసి..రోడ్డును అందుబాటులోకి తేవాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

ఐదు నెలలుగా..

చాంద్రాయణగుట్ట: రాజన్నబావి నుంచి శంషీర్‌గంజ్‌కు వెళ్లే ప్రధాన రహదారిని తవ్వి ఐదు నెలలు దాటుతున్నా ఇంకా కొత్త రోడ్డు వేయడం లేదు. గతంలో గోతులమయంగా మారిన రహదారి స్థానంలో కొత్త రోడ్డు వేయాలని స్థానికులు పలుమార్లు జీహెచ్ఎంసీ అధికారులు విన్నవించుకున్నారు. ఎట్టకేలకు నిధులు కావడంతో కాంట్రాక్ట్ దక్కించుకున్న కాంట్రాక్టర్ జనవరిలో రోడ్డును తవ్వారు. అప్పటి నుంచి రోడ్డును అలాగే వదిలేయడంతో వాహనదారులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.



తవ్వి వదిలేసిన శంషీర్‌గంజ్ రహదారి

తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం..



గౌలిపురా నుంచి లలితా బాగ్ వెళ్లే దారిలో కేబుల్ వైర్ల కోసం తవ్విన రోడ్డుతో రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. కంకర తేలిన రోడ్డుతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్డును తవ్వి రోజులు గడుస్తున్నా పనులు పూర్తి చేయకపోవడంతో స్థానికులు, వాహనదారులు పడరాని పాట్లు పడుతున్నారు.

– గొల్ల జలేందర్ యాదవ్, గౌలిపురా

రోడ్డును వెంటనే మరమ్మతు చేయాలి..



రాజన్నబావి రెడ్డి జన సంఘం నుంచి అలియాబాద్ రైస్ మిల్లుకు వెళ్లే దారి గుంతలమయంగా మారడంతో వాహనదారులు, పాదచారులు, పాఠశాల విద్యార్థులు రాకపోకలు సాగించలేకపోతున్నారు. దీంతో పాటు స్థానికంగా ఉన్న దుకాణదారులు సైతం తీవ్ర పడుతున్నాం. అధికారులు వెంటనే స్పందించి నడవలేని స్థితిలో అధ్వానంగా మారిన రోడ్డును వెంటనే మరమ్మతు చేయాలి.

– కృష్ణ చారి, షంషీర్‌గంజ్

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు



శాలిబండ: విద్యుత్ మరమ్మతుల కారణంగా సోమవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని చార్మినార్ సీబీడీ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. రూప్‌లాల్ బజార్, ఖాజీపురా, ఎస్ఎంగూడ ఓహెచ్, తేజస్వినగర్ (పురానాపూల్) విద్యుత్ ఫీడర్ల పరిధిలోని వేర్వేరు ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు. షంషీర్‌గంజ్, సత్తర్‌బాగ్, అసద్‌బాబానగర్, షరీఫ్‌నగర్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

తాళ్లగడ్డ అండర్ గ్రౌండ్ విద్యుత్ ఫీడర్ పరిధిలో..

అఫ్జల్‌గంజ్: 11 కేవీ తాళ్లగడ్డ అండర్ గ్రౌండ్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని సిత్లామాత ఆలయం, మోహిని ఫంక్షన్‌హాల్, వడ్డెర బస్తీ, జాఫర్‌గూడ, అన్నపూర్ణ దేవాలయం తదితర ప్రాంతాల్లో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు అంతరాయం ఉంటుందని అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే రాంసింగ్‌పురా విద్యుత్ పీడర్ పరిధిలోని సనా హోటల్, ఆర్య సమాజ్, ఎంసీహెచ్ పార్క్, తాళ్లగడ్డ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా ఉండదని తెలిపారు.

ఘనంగా ఫాదర్స్ డే



అబిడ్స్: అంతర్జాతీయ ఫాదర్స్ డే సందర్భంగా అశోక్ విహార్‌లో రాష్ట్ర కురుమ యువజన సంఘం అధ్యక్షుడు, గ్రేటర్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు తూమ్‌కుంట అరుణ్‌కుమార్ వేడుకలు నిర్వహించారు. కేక్ కట్‌చేసి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా అరుణ్‌కుమార్ మాట్లాడుతూ..తండ్రి పాత్ర సమాజంలో ఎంతో కఠోరమైనప్పటికీ చిరునవ్వులు చిందిస్తూ కష్టాలను దిగమింగుతూ పిల్లల ముందు సంతోషంగా జీవనం గడుపుతారన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

యాకుత్‌పురా: యాకుత్‌పురా నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ పర్యటించి స్థానికంగా కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. తలాబ్ కట్టా, అమన్‌నగర్–ఏ, రహ్మత్ నగర్, రంగేలీ కిడికి తదితర ప్రాంతాల్లో పర్యటించి స్థానికంగా కొనసాగుతున్న సీసీ రోడ్డు, సీవరేజీ డ్రైనేజీ నిర్మాణ పనులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..పత్తర్‌గట్టీ డివిజన్‌లోని అమన్‌నగర్, రహ్మత్‌నగర్‌లో రూ.22 లక్షలతో సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులు చేపట్టామన్నారు. లోతట్టు ప్రాంతాల్లో ఎలాంటి వరద నీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించామన్నారు. ఈ పర్యటనలో కార్పొరేటర్ సయ్యద్ సోహెల్ ఖాద్రీ, స్థానిక మజ్లిస్ పార్టీ నాయకులు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

కోఠి ఈఎన్‌టీ ఆసుపత్రిలో పండ్ల పంపిణీ



పండ్లు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్

సుల్తాన్‌బజార్: రానున్న ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుందని జాంబాగ్ కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ అన్నారు. కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని ఆదివారం కోఠిలోని ఈఎన్‌టీ ఆసుపత్రిలో రోగులకు, వారి సహాయకులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ..కేంద్ర మంత్రిగా కిషన్‌రెడ్డి తెలంగాణ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తూ తెలంగాణ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారన్నారు. కేంద్రమంత్రి తెలంగాణకు కావాల్సిన పథకాలను ప్రధాని నరేంద్రమోదీ దృష్టికి తీసుకువెళ్లి తెలంగాణ అభివృద్ధి చెందినందుకు ఆయన ముందుకు సాగుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్



చార్మినార్: విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఇరాన్ వైస్ కౌన్సిల్ మోహసీన్ మొఘద్దమీ అన్నారు. చంచల్‌గూడ జూనియర్ కళాశాల ఆవరణలో మూవింగ్ మీడియా బ్యూరో ఏర్పాటు చేసిన ఇంటర్నేషనల్ ఎడ్యుకేషనల్ ఎక్స్ పో ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నిరక్షరాస్యత సమాజంలో కీడు సంస్కృతికి మూలం అయ్యే ప్రమాదం ఉందన్నారు. విద్యార్థులు పోటీ పరీక్షల్లో పాల్గొనడంతో పాటు ప్రమాణాలతో కూడిన ఉన్నత విద్యాభ్యాసం చేసేందుకు గణితశాస్త్రం ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఈ ఎగ్జిబిషన్లో హైదరాబాద్‌తో పాటు జాతీయ, అంతర్జాతీయ విద్యాసంస్థలు పాల్గొని తమ ప్రత్యేకతలను వివరించాయి. నీట్ పరీక్షలో తక్కువ మార్కులు సాధించిన విద్యార్థులకు భారంగా మారిన ఎంబీబీఎస్ బోధనను సులభతరం చేసేందుకు ఇరాన్, కిర్గిస్తాన్, కజకిస్తాన్, యూకే, న్యూజిలాండ్, మలేషియా తదితర దేశాల్లో స్కాలర్షిప్‌లతో కూడిన కోర్సులను అందించేందుకు గ్యాన్‌దీప్ సంస్థ ముందు కొచ్చింది. ఈ కార్యక్రమంలో టైనీ సైంటిస్ట్ అకాడమీ చైర్మన్ హామేద్ సల్మానీ, దాన్ విద్యాసంస్థల చైర్మన్ ఫజల్ ఉర్ రహ్మాన్ ఖుర్రం, చంచల్గూడా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రమణారావు, ఎగ్జిబిషన్ నిర్వాహకులు సయ్యద్ విఖారుద్దీన్ అలీ, డాక్టర్ సయ్యద్ ఇక్రాముల్లా పాల్గొన్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి మోహన్‌రాజు



మదన మోహన్‌రాజుకు పురస్కారం అందజేస్తున్న పలువురు వక్తలు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో భీమన్న సాహితీ నిధి, కళానిలయంల సంయుక్త ఆధ్వర్యంలో పద్మభూషణ్ పురస్కార గ్రహీత బోయి భీమన్న కుమార్తె, సితార్ విధ్వాంసురాలు విజయపల్లవి బోయి జయంతి సందర్భంగా ప్రముఖ గాయకుడు ఎస్.మోహన్‌రాజుకు విజయపల్లవి సంగీత పురస్కారాన్ని ఆదివారం రవీంద్రభారతిలో ప్రదానం చేశారు. ఈ సందర్భంగా తెలుగు విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ఆచార్య వెలిదండ నిత్యానందరావు మాట్లాడుతూ.. కోవిడ్ మహమ్మారి అనేక కుటుంబాల్లో ఆత్మీయులను, ఎందరో ప్రముఖులను దూరం చేసిందని గుర్తుచేశారు. బహుముఖ ప్రజ్ఞాశాలి మోహన్‌రాజు అని కొనియాడారు. అంతకు ముందు చిన్నారుల సంగీత నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సాహితీవేత్త ఓలేటి పార్వతీశం, సిటీ కళాశాల తెలుగు ప్రొఫెసర్ కె.కోటేశ్వర్‌రావు, భీమన్న సాహితీనిధి అధ్యక్షురాలు హైమావతి భీమన్న, కళానిలయం వ్యవస్థాపక కార్యదర్శి సురేందర్ తదితరులు పాల్గొన్నారు.